కిశోరి వికాసంపై ప్రత్యేక కార్యక్రమాలు

కర్నూలు(అర్బన్): కిశోరి వికాసం సమ్మర్ స్పెషల్ క్యాంపెయిన్‌లో భాగంగా ఈ నెల 2వ తేదీ నుంచి జూన్ 10వ తేదీ వరకు జిల్లాలోని అన్ని గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఐసీడీఎస్ పీడీ నిర్మల తెలిపారు. నగరంలోని బాపూజీ నగర్ ప్రాంతంలో శుక్రవారం కిశోరి వికాసం కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. గ్రామ స్థాయిల్లో కమిటీలు ఏర్పాటు చేసుకొని కౌమార బాలికలను సమావేశ పరిచి వివిధ అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా బాల్య వివాహాలు, లింగ అసమానతలు, లైంగిక వేధింపులు, నేరాలు, వ్యక్తిగత విషయాలైన ఆరోగ్యం, పోషణ, న్యూట్రీషియన్, వ్యక్తిగత నైపుణ్యాలు, హ్యూమన్ ట్రాఫికింగ్ తదితర అంశాలను కిశోర బాలికలకు తెలియజేయాలన్నారు. కర్నూలు ప్రాజెక్టు సీడీపీఓ అనురాధ మాట్లాడుతూ.. కిశోర బాలికలు సమతుల్య ఆహారం తీసుకుంటే శారీరకంగా, మానసికంగా దృఢంగా ఎదిగేందుకు ఉపయోగ పడుతుందన్నారు. డీసీపీఓ శారద మాట్లాడుతూ.. బాలికలు ఆపదలో ఉన్నప్పుడు చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. అలాగే సేఫ్ టచ్ అండ్ సేఫ్టీ అంశాల గురించి తెలుసుకోవాలన్నారు. సూపర్‌వైజర్ వరలక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్లు మల్లేశ్వరి, విజయమ్మ, నిర్మల, ఎంఎస్‌కే ఆస్మా, మెప్మా ఉద్యోగులు వీరారెడ్డి, విజయభారతి, సరోజ, డీసీబీఎస్ సిబ్బంది నరసింహులు, నాగేశ్వరరావు, రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.


కిశోరి వికాసం కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారులు

టాప్ నంబర్ లేకుండా నడిపితే ఆటో సీజ్

కర్నూలు: పోలీసులు కేటాయించే టాప్ నంబర్ లేకుండా నడిపితే ఆటోలను సీజ్ చేస్తామని ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ హెచ్చరించారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా శుక్రవారం ఆటోడ్రైవర్లకు సీఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా, యూనిఫాం ధరించకుండా ఆటోలను నడిపితే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. తనిఖీల్లో భాగంగా టాప్ నంబర్లు, యూనిఫాం ధరించకుండా నడుపుతున్న 40 ఆటోలను పోలీసులు సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా డ్రైవర్లకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.


ఆటోడ్రైవర్లకు రోడ్డు భద్రత నిబంధనలపై కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్

బ్రాహ్మణ వటువులకు ధర్మోపనయనాలు


ధర్మోపనయనాల కార్యక్రమంలో బ్రాహ్మణ వటువులు, సంఘం నాయకులు

కర్నూలు కల్చరల్: శంకర జయంతిని పురస్కరించుకొని కర్నూలు నగర బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో బ్రాహ్మణ వటువులకు ధర్మోపనయనాల కార్యక్రమం జరిగింది. తుంగ భద్రా నది తీరంలోని సంకల్‌బాగ్‌లో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి, భవానీ సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం జగద్గురువు ఆదిశంకరాచార్యుల వారి విగ్రహానికి అభిషేకం జరిగింది. అనంతరం బ్రహ్మశ్రీ వేదపండితులు కమల సాయి, పురోహితుడు కోదండ రామశర్మ బృందం ఆధ్వర్యంలో వటువులకు ఉపనయనాల కార్యక్రమాలు జరిగాయి. కర్నూలు నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి చల్లా నాగరాజ్ శర్మ, ఉపాధ్యక్షుడు కంచుగంటల శ్యాం సుందర్ శర్మ, గౌరవ సలహాదారు టీవీ రవిచంద్ర శర్మ, సభ్యులు కృష్ణ, జ్యోతి, ఆనందరావు, శివన్న, ప్రధాన అర్చకులు ప్రసన్నస్వామి, మహేష్, బ్రాహ్మణ పెద్దలు కల్లే వేణుగోపాల్ శర్మ, కేవీ సుబ్బారాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు చికిత్స

కర్నూలు(హాస్పిటల్): నంద్యాల జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చికిత్స అందిస్తున్నారు. ఆత్మకూరు మండలం బైర్లూటి సమీపంలో బొలెరో వ్యాన్ బోల్తా పడి నలుగురు మృతి చెందగా 14 మందికి గాయాలయ్యాయి. ఆదోని పట్టణానికి చెందిన వారు శ్రీశైలం మల్లికార్జునస్వామిని దర్శించుకుని తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను శుక్రవారం రాత్రి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తీసుకొచ్చారు. వారిని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు పరామర్శించి మెరుగైన వైద్యం అందేలా ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం ప్రత్యేక వైద్యబృందాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.


వైద్య సేవల గురించి తెలుసుకుంటున్న సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు

నేడు రామాయణ ప్రవచనాలు

కల్లూరు: కల్లూరు అర్బన్ 32వ వార్డులోని ముజఫర్‌నగర్‌లో ఉన్న పంచముఖి ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం రామాయణ ప్రవచనాల కార్యక్రమం ఉంటుందని ఆలయ ధర్మకర్త చిలుకూరు ప్రతాప్ శుక్రవారం తెలిపారు. ఇంటాక్ లైఫ్ మెంబర్ డాక్టర్ గుంటూరు సుబ్బరామయ్య ప్రవచనాలు వినిపిస్తారన్నారు. కార్యక్రమాన్ని ప్రతి శనివారం నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని రామాయణాన్ని తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బాలయ్య, శ్రీరాములు, భాస్కర్, అంబాజీరావు, గౌరమ్మ, ఉమామహేశ్వరి, తిరుపతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

విశ్వంలోని రహస్యాలను శోధించడమే సైన్స్


మాట్లాడుతున్న జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బి.సురేష్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): విశ్వంలోని రహస్యాలను శోధించడమే సైన్స్ అని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బి.సురేష్‌కుమార్ చెప్పారు. శుక్రవారం స్థానిక బిర్లా కాంపౌండ్‌లోని డాక్టర్ బ్రహ్మారెడ్డి హాస్పిటల్ కాన్ఫరెన్స్ హాలులో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రజల సమస్యలైన అక్షరాస్యత, సారా ఉద్యమం, పొదుపు, మహిళా సాధికారత తదితర అంశాలపై జన విజ్ఞాన వేదిక పనిచేసిందన్నారు. రాబోయే కాలంలో యువత, అలవాట్లు, విద్య, ఆరోగ్యం, సైబర్ నేరాలు వంటి రంగాల్లో పనిచేస్తుందన్నారు. రాష్ట్ర మహాసభలు జులై నెలలో కడప లేదా ఒంగోలులో నిర్వహించాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించిందని తెలిపారు. విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు పెంచేందుకు సైంటిఫిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, కోశాధికారి సనా ఉల్లా, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్): తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహన డ్రైవర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని ఆ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర సలహాదారు శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్ వద్ద తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహన డ్రైవర్లు ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఏడు సంవత్సరాలుగా తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లుగా పనిచేస్తున్న వారికి రూ.8800 వేతనం ఇస్తున్నారని, ఇది ప్రస్తుత ఖర్చులకు ఏ మాత్రం సరిపోదని, యాజమాన్యం సరైన సమయానికి పీఎఫ్ చెల్లించడం లేదని, అయితే ఉద్యోగుల నుంచి మాత్రం వసూలు చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాక ఉద్యోగులకు వీక్లీ ఆఫ్‌లు, జాతీయ సెలవు దినాలను అమలు చేయడం లేదని, ఆరోగ్య బీమా, ప్రమాద బీమాను అమలు చేయాలని కోరారు. 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని కోరారు. ప్రమాదాలు జరిగినప్పుడు, వాహనాలు రిపేర్లు వచ్చినప్పుడు యాజమాన్యమే భరించాలని కోరారు. అనంతరం డీఆర్వో సి.వెంకటనారాయణమ్మకు వినతిపత్రం ఇచ్చారు. జిల్లా యూనియన్ అధ్యక్షుడు రంగస్వామి, కార్యదర్శి లోకేష్, ట్రెజరర్ నరేంద్రరెడ్డి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహన డ్రైవర్లు

కార్మిక సమ్మెను జయప్రదం చేయండి

కర్నూలు(సెంట్రల్): మే 20వ తేదీన దేశవ్యాప్తంగా జరిగే కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శులు ఎండీ అంజిబాబు, ఎస్.మునెప్ప పిలుపునిచ్చారు. శుక్రవారం సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమ్మె కార్యచరణలో వారు మాట్లాడుతూ.. నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చాక కార్మిక చట్టాలను రద్దు చేయడంతో కార్మికులు బానిసలుగా మారారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ 20వ తేదీన చేపట్టే సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ప్రధానంగా నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని జరగుతున్న పోరాటంలో ప్రతి కార్మికుడు పాలుపంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో నరసింహులు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్.మునెప్ప, ఎండీ అంజిబాబు

డిగ్రీ విద్యార్థులకు శిక్షణ, ఉద్యోగ అవకాశాలు

కర్నూలు(హాస్పిటల్): డిగ్రీ చదివిన విద్యార్థులకు స్వల్పకాలిక సర్టిఫికెట్ కోర్సును నిర్వహిస్తున్నట్లు బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య ఆరోగ్య రంగంలో నైపుణ్యాలను అందించే ఈ సర్టిఫికెట్ కోర్సునకు డిగ్రీ పాస్/ఫెయిలైన విద్యార్థులు కూడా అర్హులన్నారు. అభ్యర్థులకు 18 నుంచి 30 ఏళ్లలోపు వయస్సుండాలన్నారు. ఏడాది వ్యవధిగల ఈ కోర్సులో ఆరు నెలల పాటు అభ్యర్థులకు స్టైఫండ్ ఇస్తామన్నారు. ఈ కోర్సు పూర్తయిన అనంతరం ఆయా రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. కోర్సులో చేరాలనుకునే వారు 93922 51434, 79950 13422 నంబర్లకు కాల్ చేయాలని కోరారు. మరిన్ని వివరాలకు కర్నూలు నగరం జొహరాపురం రోడ్డులోని కిమ్స్ హాస్పిటల్ ఆవరణలో ఉన్న బొల్లినేని మెడిస్కిల్స్‌లో సంప్రదించాలని సూచించారు.

ఘనంగా శంకర జయంతి

కర్నూలు కల్చరల్: స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో శుక్రవారం శంకర జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆదిశంకరాచార్య భగవత్ పాదులకు విశేష పూజలు, అర్చనలు జరిగాయి. ఆరుద్రా నక్షత్రం సందర్భంగా శ్రీ గౌరీ శంకర స్వామికి పంచామృతాభిషేకాలు, అన్నాభిషేకం, తదితర పూజలు విశేషంగా నిర్వహించారు. వైశాఖ శుద్ధ పంచమి సందర్భంగా శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ మాతృమూర్తి, యోగా గురువు జయలక్ష్మి మాత జయంతిని నిర్వహించారు. పంచామృతాభిషేకం, దుర్గాపూజ, లలితా సహస్రనామ పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయం ట్రస్ట్ సభ్యులు, మాతృమండలి సభ్యులు పాల్గొన్నారు. అలాగే ఓల్డ్‌సిటీ లలితా పీఠంలో శంకర జయంతి ఘనంగా నిర్వహించారు.

అన్న క్యాంటీన్లపై ప్రజాభిప్రాయ సేకరణ

కర్నూలు (టౌన్): నగరంలోని అన్ని అన్న క్యాంటీన్ల నిర్వహణపై ప్రజలు తమ అభిప్రాయాలను తెలియజేయాలని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు కోరారు. శుక్రవారం స్థానిక పరిమళ నగర్‌లోని అన్న క్యాంటీన్‌ను కమిషనర్ పరిశీలించారు. అక్కడి ప్రజలతో మాట్లాడారు. ఆహారం రుచి గురించి ఆరా తీశారు. ప్రతి అన్న క్యాంటీన్ వద్ద క్యూఆర్ కోడ్ ఉంటుందని, దీన్ని స్కాన్ చేసి ప్రజలు తమ అభిప్రాయాలను తెలియజేయవచ్చన్నారు. ప్రజల సూచనల ఆధారంగా అన్న క్యాంటీన్‌లను మరింత మెరుగు పరిచేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

పడకేసిన పారిశుద్ధ్యం


పంచలింగాలలో ఇళ్ల ముందు పారుతున్న మురుగు

కర్నూలు(రూరల్): గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. పంచలింగాల గ్రామం సుంకులమ్మ ఆలయ కాలనీలో డ్రైనేజీ లేకపోవడంతో మురుగు నీరు ఇళ్ల ముందే పారుతూ దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో ఆ కాలనీ మీదుగా వెళ్లాలంటే ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. మురుగునీటి వల్ల దోమలు, విషకీటకాల బారిన పడి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. సమస్యపై ఫిర్యాదు చేసినా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎత్తుకు తగ్గ బరువు ఉండాలి

కల్లూరు: పిల్లలు ఎత్తుకు తగ్గ బరువు ఉండాలని సంచార చికిత్స కార్యక్రమ జిల్లా అధికారి డాక్టర్ రఘు అన్నారు. శుక్రవారం ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని ఉలిందకొండ అంగన్‌వాడీ కేంద్రంలో జరుగుచున్న కిశోరి వికాస కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్న పిల్లలందరి ఎత్తు, బరువు తీసి తల్లులకు అవగాహన కల్పించాలన్నారు. గర్భిణులు, బాలింతలు అందుబాటులో లభించే పోషక విలువలతో ఉన్న ఆకుకూరలు, పండ్లు, గుడ్లు, పాలు తదితర వాటిని రోజు వారీ ఆహారంలో తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి విజయ్‌కుమార్, ఆరోగ్య పర్యవేక్షకులు నాగరాజు, మద్దమ్మ, ఆరోగ్య కార్యకర్త ప్రశాంతి, ఆశా కార్యకర్తలు, ప్రాజెక్షనిస్ట్ ఖలీల్, తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా దంత వైద్య పరీక్షలు

కర్నూలు (హాస్పిటల్): నగరంలోని అరోరా నగర్‌లో ఉన్న రాజరాజేశ్వరి దేవాలయం ఆవరణలో శుక్రవారం ఉచిత దంత వైద్య పరీక్షల శిబిరం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు, న్యాయవాది శ్రీధర్ ఆధ్వర్యంలో ఏఆర్‌జీఎస్ కేర్ సౌజన్యంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. శిబిరానికి వచ్చిన వారికి దంత వైద్యులు డాక్టర్ రాజ జగదీశ్ కుమార్, డాక్టర్ దివ్యా రెడ్డి చికిత్స అందించారు. అనంతరం వారికి మందులు, టూత్ పేస్టులు పంపిణీ చేశారు.

గార్గేయపురం పీహెచ్‌సీ తనిఖీ

కర్నూలు (హాస్పిటల్): జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ పి.శాంతికళ శుక్రవారం సాయంత్రం కర్నూలు మండలం గార్గేయపురం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. అక్కడి రికార్డులు, రిపోర్టులు పరిశీలించారు. టీకాలు నిల్వ ఉంచే యంత్రాలను, కాన్పుల గదిని, ల్యాబ్, మందుల గదిని, వార్డును తనిఖీ చేశారు. పాము కాటు, కుక్క కాటుకు సంబంధించిన మందులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు వైద్య అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండి అవసరమైన వైద్య సేవలు అందించాలన్నారు. ఆ వివరాలను సంబంధిత రిజిస్టర్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. సాధారణ కాన్పులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనే నిర్వహించాలని, ఏదైనా ప్రమాదకర లక్షణాలు ఉన్నట్లయితే కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు రెఫర్ చేయాలన్నారు. డెమో శ్రీనివాసులు శెట్టి, ఆరోగ్య విద్య బోధకురాలు పద్మావతి, స్టాఫ్ నర్సు నిర్మల రాణి ఉన్నారు.


టీకాల నిల్వ గురించి తెలుసుకుంటున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ

బిర్లా సర్కిల్‌కు కొత్త శోభ

కర్నూలు(అర్బన్): నగరంలోని బిర్లా సర్కిల్ కొత్త శోభ సంతరించుకుంది. ఈ సర్కిల్‌లో పూలే దంపతుల విగ్రహాలను ఏర్పాటు చేయాలనే ఆకాంక్షతో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు ఈ విగ్రహాలను తెప్పించారు. అయితే ఈ సర్కిల్‌లో జ్యోతిరావు పూలే విగ్రహాన్ని మాత్రమే ఏర్పాటు చేసి ఆయన సతీమణి సావిత్రీబాయి విగ్రహాన్ని ఏర్పాటు చేయడంలో అధికార యంత్రాంగం కొంత జాప్యాన్ని ప్రదర్శించింది. ఈ నేపథ్యంలో గత కొన్ని నెలలుగా సావిత్రీబాయి విగ్రహం సంక్షేమ భవన్‌లోనే ఉండింది. కాగా, గత నెల 11న జరిగిన జ్యోతిరావుపూలే జయంతి సందర్భంగా ఈ సర్కిల్‌లోనే సావిత్రీబాయి విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేయాలని పలువురు బీసీ సంఘాల నాయకులు జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం సావిత్రీబాయి విగ్రహాన్ని భర్త జ్యోతిరావు పూలే విగ్రహం పక్కనే ఏర్పాటు చేశారు. స్ఫూర్తి ప్రదాతలైన పూలే దంపతుల విగ్రహాలు ఏర్పాటు చేయడంతో ఈ సర్కిల్ ప్రజలను ఆకర్శిస్తోంది.


బిర్లా సర్కిల్‌లో ఏర్పాటు చేసిన పూలే దంపతుల విగ్రహాలు

దోమలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): దోమలు అరికట్టేందుకు ప్రజలలో చైతన్యం కలిగించి, తగిన చర్యలు తీసుకోవాలని డెమో శ్రీనివాసులు శెట్టి ఆదేశించారు. ఆయన శుక్రవారం స్థానిక బంగారుపేటలో నిర్వహిస్తున్న ఫ్రైడే – డ్రైడే కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య సిబ్బంది వారి పరిధిలోని వార్డులను సందర్శించి ప్రజలు వారానికి ఒకసారి తమ ఇళ్లలో నీటి నిల్వలను పూర్తిగా తొలగించి దోమలు పెరుగుదలను అరికట్టే విధంగా అవగాహన కల్పించాలన్నారు. అంతేగాక ప్రజలు వారి గృహ పరిసరాల్లో పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, పాత డబ్బాలు, ఉపయోగించని రోళ్లు వంటి వాటిలో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని చెప్పారు. ఈ వివరాలను ఫ్రైడే – డ్రైడే యాప్‌లో క్రమం తప్పక అప్‌లోడ్ చేయాలని, ఒకవేళ నీటి నిల్వలు గల ప్రాంతాలను గుర్తించినట్లయితే ఆ వివరాలను వెక్టార్ కంట్రోల్ హైజిన్ యాప్‌లో అప్‌లోడ్ చేసి, సంబంధిత వార్డు సచివాలయ సెక్రటరీ ద్వారా సమస్య పరిష్కారం అయ్యే విధంగా చూడాలని ఆదేశించారు. దీనివల్ల దోమల వల్ల వ్యాప్తి చెందే వ్యాధులైన మలేరియా, డెంగీ, చికున్ గున్యా, బోధకాలు, మెదడువాపు వంటి వ్యాధులను అరికట్టవచ్చన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో వడదెబ్బ నివారణపై అవగాహన కల్పించారు. వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ, డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి, ఆరోగ్య కార్యకర్త రవళి, అంగన్‌వాడీ కార్యకర్తలు కౌసల్య, ఆనందమ్మ, ఆశా కార్యకర్త జ్యోతి పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న డెమో శ్రీనివాసులు శెట్టి

నెత్తిన నీళ్లు.. నోట్లో మట్టి కొట్టేందుకే ప్రధాని పర్యటన

కర్నూలు(టౌన్): 2014లో ప్రధాని నరేంద్ర మోదీ అమరావతికి వచ్చారు. నెత్తిన నీళ్ల చల్లారు అంతే.. ఇప్పుడు మరోసారి వచ్చారు. అమరావతిని రూ.లక్ష కోట్ల అప్పుతో నిర్మిస్తామని కల్లబొల్లి మాటలు చెబుతున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి విమర్శించారు. ఆయన శుక్రవారం స్థానిక ఎస్వీ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజధాని పేరుతో వేసిన శిలాఫలకాలనే మళ్లీ ఆవిష్కరిస్తారా? అని ప్రశ్నించారు. 2014–2019 వరకు ఐదేళ్ల పాలనలో చంద్రబాబు ఏం చేశారన్నారు. అమరావతి, పోలవరం అంటూ జపం చేయడం తప్పా.. ఎందుకు అభివృద్ధి చేయలేదని, ప్రజలను మరోసారి మోసం చేసేందుకు శిలాఫలకాల డ్రామా ఆడుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రచారం కోసం 6 వేల బస్సులతో ప్రజాధనం దుర్వినియోగం తప్పా ఒరిగింది శూన్యమన్నారు. రూ.లక్ష కోట్లతో రాజధాని నిర్మాణం చేస్తామని చెబుతున్న ప్రభుత్వం ఇతర జిల్లాలను ఏమి చేస్తుందని ప్రశ్నించారు. రాజధాని పేరుతో చంద్రబాబు నాయుడు, ప్రధాని నరేంద్ర మోదీ వ్యాపారం చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ భవనాల నిర్మాణాల పేరుతో కమీషన్లు దండుకుంటున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలు కట్టేందుకు రాష్ట్ర ప్రజలందరిపై భారం మోపుతున్నారన్నారు. అభివృద్ధి వికేంద్రీకరణతోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమన్నారు.

రమణీయం.. సాయినాథుడి రథోత్సవం


అశేష భక్తజనం మధ్య సాగుతున్న సాయినాథుడి రథోత్సవం, (ఇన్‌సెట్) సాయినాథుడు

కోడుమూరు రూరల్ : మండలంలోని పులకుర్తి గ్రామంలో వెలసిన సాయినాథుడి మహా రథోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం స్వామి వారి రథోత్సవ కార్యక్రమాన్ని గ్రామస్తులు ఎంతో వైభవంగా నిర్వహించారు. రథోత్సవం సందర్భంగా సాయినాథుడికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని రథంపై ఆశీనుల చేసి గ్రామ వీధుల గుండా రథోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. రథోత్సవం సందర్భంగా కోడుమూరు పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

క్రీడలతో ఏకాగ్రత


చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ శంకర్ శర్మ

కర్నూలు (టౌన్): విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఏకాగ్రత పెరగాలంటే క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. శుక్రవారం స్థానిక పెద్దమార్కెట్ లక్ష్మీ నరసింహస్వామి కల్యాణ మండపంలో వేసవి తైక్వాండో శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడుతూ.. వేసవి కాలంలో సెలవులను వృథా చేయకుండా ఏదైనా క్రీడాంశాన్ని ఎంచుకొని నిత్య సాధన చేయాలన్నారు. మార్షల్ ఆర్ట్స్ తైక్వాండోలో ఉచిత శిక్షణను వినియోగించుకోవాలన్నారు. కరాటే శిక్షకులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రాయలసీమ డిక్లరేషన్ ఎక్కడ?


ధర్నా చేస్తున్న రాయలసీమ ఉద్యమకారులు

కర్నూలు(సెంట్రల్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ×మిషన్ రాయలసీమ.. రాయలసీమ డిక్లరేషన్లన్నీను ఎప్పుడు అమలు చేస్తాయని కర్నూలు డెవలప్‌మెంట్ ఫోరం, రాయలసీమ విద్యార్థి పోరాట సమితి ప్రశ్నించాయి. శుక్రవారం ఆయా సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కర్నూలు డెవలప్‌మెంట్ ఫోరం కన్వీనర్ మోహన్ కడింపల్లి, రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్ మాట్లాడుతూ.. కేంద్రం, రాష్ట్రంలోని బీజేపీ, టీడీపీ జనసేన పార్టీలు రాయలసీమకు అన్యాయం చేస్తున్నాయని ఆరోపించారు. అప్పులు చేసి కేవలం అమరావతికే సంపద పెట్టడం ఎంతవరకు కరెక్టు అని ప్రశ్నించారు. కర్నూలులో హైకోర్టు ఎప్పుడు ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో సత్యనారాయణ గుప్తా, శేఖర్ పపోతుల, పాలకొమ్మ అశోక్ పాల్గొన్నారు.

వర్సిటీకి మంచి పేరు తేవాలి


మాట్లాడుతున్న వీసీ వి.వెంకట బసవరావు

కర్నూలు (హాస్పిటల్): ఉన్నత విద్యను పూర్తి చేసుకుని బయటకు వెళ్తున్న విద్యార్థులు తల్లిదండ్రులతో పాటు చదువుకున్న యూనివర్సిటీకి కూడా మంచి పేరు తీసుకురావాలని ఆర్‌యూ వీసీ వి.వెంకట బసవరావు ఆకాంక్షించారు. ఆర్‌యూలోని ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో శుక్రవారం ద్వితీయ సంవత్సర విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ విద్యార్థులు సరైన సంస్కారాన్ని సాధించినప్పుడే చదువుకున్న చదువుకు సార్థకత చేకూరుతుందన్నారు. వివిధ పోటీ పరీక్షలకు హాజరవడం ద్వారా జీవితంలో వీలైనంత త్వరగా స్థిరపడాలని సూచించారు. అనంతరం వివిధ క్రీడాంశాలతో పాటు వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. రెక్టార్ ఆచార్య ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయకుమార్ నాయుడు, సీవీ కృష్ణారెడ్డి, పీవీ సుందరానంద్, ఆర్.భరత్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరేళ్ల సర్వీసున్న వారిని రెగ్యులర్ చేయాలి


దీక్ష చేపట్టిన ఆరోగ్య శాఖ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

కర్నూలు(సెంట్రల్): ఆరేళ్ల సర్వీసు పూర్తైన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఏపీ మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్/కమ్యూనిటీ ఆఫీసర్స్ అసోషియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చందన, ప్రసాద్ డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 10 వేల మంది ఉద్యోగుల్లో ఆరేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారు 300 మంది ఉన్నారన్నారు. శుక్రవారం ధర్నా చౌక్‌లో ఏపీ మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్/కమ్యూనిటీ ఆఫీసర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో సీహెచ్‌ఓలు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వెంటనే సీహెచ్‌ఓల సర్వీసును హెచ్‌ఆర్ పాలసీ క్యాడర్‌లోకి అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఇన్సెంటివ్‌లను విడుదల చేయాలని కోరారు. ట్రెజరర్ కార్తిక్, జాయింట్ ట్రెజరర్ అఖిల్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ డీఅడిక్షన్‌పై శిక్షణ

కర్నూలు (హాస్పిటల్): సెల్‌ఫోన్ డీఅడిక్షన్‌పై విద్యార్థులకు రెండు రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బి.సురేష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక బిర్లా కాంపౌండ్‌లోని కృష్ణకాంత్ ప్లాజాలోని డాక్టర్ బ్రహ్మారెడ్డి హాస్పిటల్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఈ నెల 3, 4 తేదీల్లో శిక్షణ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమానికి ప్రముఖ మేథమెటిక్స్ స్కిల్స్ అకాడమీ (హైదరాబాద్) సంస్థ డైరెక్టర్ చంద్రయ్య హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు నేరుగా హాజరుకావచ్చన్నారు.